## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

-  భోగాపురంలో నూతనంగా నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు జాతికి అంకితం చేశారు.

-  వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్-పీజీ 2026' (NEET-PG) పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా స్పష్టం చేశారు.

-  గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్-2026లో మహిళల బాక్సింగ్ విభాగంలో భారత్ రెండు స్వర్ణ పతకాలను సాధించింది.

-  ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్ రెండో అర్ధభాగంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు జాతికి అంకితం చేశారు. దీంతో పాటు రాష్ట్రంలో రహదారులు, విద్యుత్ విభాగానికి సంబంధించి 18 వేల కోట్ల రూపాయల విలువైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభనుద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాష్ట్రం సాధిస్తున్న వేగవంతమైన ప్రగతికి.. విమానాశ్రయాలు, రహదారులు, విద్యుత్ రంగాల్లో చేపట్టిన 18 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులే నిదర్శనమని పేర్కొన్నారు. తాజాగా ప్రారంభించిన రెండో విడత ఉడాన్ పథకం ప్రాంతీయ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. మౌలిక వసతులు, పెట్టుబడులపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెడుతోందని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్పాదకత, ఎగుమతులు వృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొంటూ...

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

శాస్త్ర, సాంకేతిక, క్రీడా రంగాల్లో భారతీయ యువత సాధిస్తున్న ప్రగతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. దేశ నిర్మాణానికి యువతను సంసిద్ధులను చేసి, వారిని సాధికారత వైపు నడిపించడమే స్వామి వివేకానంద స్వప్నమని, యువతకు లభించే విద్యే దేశాభివృద్ధికి బలమైన పునాదిగా ఆయన భావించారని పేర్కొన్నారు. మైసూరులో నూతనంగా నిర్మించిన స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రం 'వివేక స్మారకాన్ని' ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, జల సంరక్షణ, ప్రకృతి

వనరుల పరిరక్షణతో పాటు భారతీయ హస్తకళలను ప్రోత్సహించడంలో యువత క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. నేడు భారత యువత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద 'స్టార్టప్' వ్యవస్థకు, 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' ఉద్యమాలకు నాయకత్వం వహిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్-పీజీ 2026' (NEET-PG) పరీక్షను అత్యంత సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీన జరగనున్న నీట్-పీజీ పరీక్ష సన్నాహకాలపై ఆయన ఈరోజు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యున్నత స్థాయి గోప్యత, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పరీక్ష నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరీక్ష ప్రశ్నాపత్రాన్ని పూర్తి ఎన్‌క్రిప్టెడ్ రూపంలో, బహుళ అంచెల సాంకేతిక భద్రత నడుమ, పరీక్ష ప్రారంభమయ్యే కొద్ది నిమిషాల ముందు మాత్రమే అత్యంత సురక్షిత ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. దీనివల్ల ప్రశ్నాపత్రం లీకేజీకి ఎలాంటి ఆస్కారం ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కు ప్రతిష్ఠాత్మక 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం-2026' లభించింది. పుణేలో లోకమాన్య తిలక్ స్మారక ట్రస్ట్ ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ 106వ వర్ధంతిని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా ఈ అవార్డును అజిత్ దోవల్ కు అందజేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. దేశ భద్రతను బలోపేతం చేయడంలో అజిత్ దోవల్ అసాధారణమైన సేవలు అందించారని కొనియాడారు. జాతీయ భద్రతకు సంబంధించి తీసుకున్న పలు కీలక నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో దోవల్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఇక అజిత్ దోవల్ మాట్లాడుతూ.. లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ చూపిన దేశభక్తి, త్యాగం, కర్తవ్య నిష్ఠ వంటి ఆదర్శాలను యువత పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ప్రస్తుత నైరుతి రుతుపవనాల వల్ల తీవ్ర వరద ప్రభావానికి గురైన పలు రాష్ట్రాలను ఆదుకునేందుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (SDRF) కింద కేంద్ర వాటా నుంచి 2,117.85 కోట్ల రూపాయలను ముందస్తుగా విడుదల చేసేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈరోజు ఆమోదం తెలిపారు. వరదలతో సతమతమవుతున్న ఏడు ప్రధాన రాష్ట్రాలకు ఈ నిధులు తక్షణ సహాయంగా అందనున్నాయి. వీటిలో హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, నాగాలాండ్‌లు ఇదివరకే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను అందుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వస్తు సేవల పన్ను (GST) వసూళ్లు సరికొత్త రికార్డు నమోదు చేశాయి. గడిచిన నెలలో మొత్తం జీఎస్టీ రాబడి 2 లక్షల 11 వేల 205 కోట్ల రూపాయలకు చేరింది. 2025 జూలైలో వచ్చిన లక్షా 83 వేల 65 కోట్ల రూపాయలతో పోలిస్తే ఇది వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాలను వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలకు పన్ను వాటా రూపంలో లక్షా 9 వేల 19 కోట్ల రూపాయలు ఈరోజు పంపిణీ చేసింది. షెడ్యూల్ ప్రకారం ప్రతి నెల 10వ తేదీన విడుదల చేసే సాధారణ పన్నుల వాటాకు ఇది అదనమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రాల వద్ద తగినంత నిధుల లభ్యత ఉంటే మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టుల వేగాన్ని మరింత పుంజుకునేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఈ ముందస్తు నిధులను కేటాయించినట్లు కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ (LPG) గ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు తగ్గించాయి. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను దాదాపు 200 రూపాయల వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. సవరించిన ఈ కొత్త ధరలు నేటి నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ తగ్గుదలతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర 2వేల 738 రూపాయలకు చేరింది.

= = = = = = = = = = = = = = = = = = = =

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్-2026లో మహిళల బాక్సింగ్ 54 కేజీల విభాగంలో భారత బాక్సర్ ప్రీతి పవార్ స్వర్ణ పతకం సాధించగా, 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియాలు సైతం పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నారు. పురుషుల షాట్‌పుట్ పారా అథ్లెటిక్స్ విభాగంలో భారత క్రీడాకారుడు సోమన్ రాణా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే విభాగంలో మరో భారత అథ్లెట్ శుభమ్ జుయల్ రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. భారత క్రీడాకారుల ప్రదర్శనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర క్రీడా శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కామన్వెల్త్ క్రీడల్లో ఇప్పటివరకు భారత్ సాధించిన పతకాల సంఖ్య 30కి చేరింది. ఇందులో 8 స్వర్ణ పతకాలు, 15 రజతాలు, 7 కాంస్య పతకాలు ఉన్నాయి. కామన్వెల్త్ పతకాల పట్టికలో ప్రస్తుతం భారత్ 6వ స్థానంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్ రెండో అర్ధభాగంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ముఖ్యంగా ఈ నెలలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో 94 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అయితే, వాయువ్య, మధ్య భారతదేశంలోని కొన్ని భాగాలు.. అలాగే తూర్పు, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం వర్షపాతం మెరుగ్గా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెలలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా కేలామ్ ప్రాంతంలో ఉగ్రవాదుల కాల్పుల ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. తీవ్రంగా గాయపడి శ్రీనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెండో కార్మికుడు కూడా ఈరోజు తుదిశ్వాస విడిచినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఇద్దరు నిరుపేద కార్మికులపై శుక్రవారం ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడి అనంతరం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకుని, పరారైన ఉగ్రవాదుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =